క్లుప్తంగా

సీసీ డ్రైన్‌కు శంకుస్థాపన



తెనాలిఅర్బన్: 40వ వార్డు వెలువోలు వారి వీధిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రైన్‌కు మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40వ వార్డు అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్యారడైజ్ గృహ సముదాయంలో గొబ్బెమ్మలు



తెనాలి టౌన్: ధనుర్మాసం సందర్భంగా గంగానమ్మ పేటలోని ప్యారడైజ్ గృహ సముదాయంలో ఆధ్యాత్మిక సేవకురాలు, భక్తి కీర్తన గాయని శారదా చలపతి ఆధ్వర్యంలో బుధవారం గొబ్బిళ్ల ఉత్సవం నిర్వహించారు. గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. గొబ్బెమ్మలను లక్ష్మీస్వరూపం, గోపిక స్వరూపంగా పూజిస్తామని, శ్రీకృష్ణుడు గోపికలను కరుణించినట్లు ప్రజలకు అభయహస్తం ఇస్తారని నిర్వాహకురాలు అన్నారు. ప్రతి ఏడాది ధనుర్మాసంలో దేవస్థానాలు, పాఠశాలల్లో పండుగ జరుపుతున్నామని, భోగిపండుగ వరకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సత్యవతి, సుబ్బాయమ్మ, సునీత, వయూక, కోటేశ్వరి, రాజకుమారి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి డాన్స్ పోటీలకు శృతి ఎంపిక



తాడేపల్లిరూరల్: జాతీయ స్థాయి డాన్స్ పోటీలకు కేఎల్‌యూ విద్యార్థిని కాకర్లపూడి శృతి సమన్వి ఎంపికైంది. వర్సిటీ డీన్ డాక్టర్ సిహెచ్.హనుమంతరావు బుధవారం వివరాలు వెల్లడించారు. బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శృతి, సాక్‌లోని డాన్స్ క్లబ్‌లో క్రియాశీలక సభ్యురాలు, ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టింబర్ 2023–24లో క్లాసికల్ డ్యాన్స్ విభాగంలో ఆమె జాతీయ స్థాయిలో 2వ స్థానాన్ని కైవసం చేసుకుందని తెలిపారు. ఈసంవత్సరం మార్చిలో లూథియానాలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు చెప్పారు. ఈ సందర్భంగా శృతి సమన్విని వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.హనుమంతరావు అభినందించారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని డాక్టర్ కేఆర్‌ఆర్‌ఎం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం తుమ్మపూడిలో జగనన్న కాలనీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.గిరిధరరావు, సర్పంచి షేక్ అజీజున్, వైస్ ప్రిన్సిపాల్ వై.పూర్ణచంద్రరావు, ఎన్‌ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

మేడికొండూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో వైద్య సేవలు పొందేందుకు వచ్చిన గర్భిణులకు హెల్ప్ ఫౌండేషన్ అమ్మ కోసం కార్యక్రమం పేరుతో పౌష్టికాహారం అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు పి.అనిరుథ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు శ్రీలత సాంబశివరావు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీల్లో సెయింట్స్ ఆన్స్ క్రీడాకారుల ప్రతిభ

ఫిరంగిపురం: త్రోబాల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. గుంటూరు రూరల్ నల్లపాడు లయోలా పబ్లిక్ స్కూల్‌లో గతనెల డైమండ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఇంటర్ స్కూల్ కాంపిటేషన్ త్రోబాల్ పోటీలు నిర్వహించారు. కాగా పోటీల్లో ఫిరంగిపురం సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభచూపి ట్రోఫీ, మెడల్స్ సాధించారు. బుధవారం పాఠశాలలో ట్రోఫీ, మెడల్స్‌ను లయోలా పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ ఆంతోని, ప్రిన్సిపాల్ ఫాదర్ సురేష్ అందజేశారు. ఈసందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెచ్ఎం సిస్టర్ ఒట్టి, థెరసమ్మ, పీఈటీలు నిర్మల మేరి, శిల్ప, ఉపాధ్యాయుడు ఇన్నారెడ్డి పాల్గొన్నారు. ట్రోఫీ సాధించిన విద్యార్థులను జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, కె.చిన్నప్పరెడ్డి, అంజిరెడ్డి అభినందించారు.

క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు

- జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా
- మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ హెనీక్రిస్టినా

కొల్లిపర: క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపుతో పాటు విద్యా, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి వారు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా ఎదగటానికి అవకాశాలు కల్పిస్తున్నారని జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీల కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. తొలుత అమె క్రీడా మైదానంలో జాతీయ జెండా, ఆడుదాం ఆంధ్రా జెండాను ఎగుర వేసి, క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, పార్టీ నాయకులు ఆరిగ చంద్రారెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, మంద్రు రాజు, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ జి.నాంచారయ్య, మండల పరిషత్ పరిపాలన ఏవో చంద్రమోహన్, పాఠశాలల ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ప్రారంభం

తెనాలి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మండల స్థాయిలో బుధవారం ప్రారంభమయ్యాయి. రూరల్ మండలం నందివెలుగులోని క్రీడా ప్రాంగణంలో షటిల్ పోటీలను మండల ప్రత్యేక అధికారి వనజ ప్రారంభించారు. అనంతరం కొలకలూరులోని జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో క్రికెట్ పోటీలను మండల ప్రత్యేక అధికారి వనజ, ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డిలు ప్రారంభించారు. నందివెలుగులో షటిల్, అంగలకుదురులో ఖోఖో, కొలకలూరులో క్రికెట్, సంగంజాగర్లమూడిలో వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. మండల స్థాయి అనంతరం, నియోజకవర్గ స్థాయి పోటీలు జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు. పోటీలను పీడీలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు ఉమాదేవి, రామసుబ్బారావు, వినయ్‌బాబు, ప్రసాదరావు, విద్యాసాగర్‌లు పర్యవేక్షించారు.



కొలకలూరులో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న మండల ప్రత్యేక అధికారి వనజ



తెనాలిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో జరుగుతున్న చండీసహిత హనుమధీశ్వర మహాయజ్ఞంలో భాగంగా బుధవారం స్వామివారికి లక్ష తులసీ దళార్చన చేసి హారతినిస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పుష్ప దంపతులు, కుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ

– తెనాలి

విగ్రహావిష్కరణలో పాల్గొనండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



తెనాలిఅర్బన్: భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తూ ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. అక్కడ డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఫ్లెక్సీపై సంతకాలు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఆమె మాట్లాడుతూ 19న విజయవాడలో జరగనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు పట్టణంలోని ఒక్కో సచివాలయం నుంచి ఐదుగురు వెళ్లేందుకు పేర్లు నమోదు చేయించుకున్నట్లు చెప్పారు. అందరు దానిలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు, మేనేజర్ అప్పలరాజు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సామాజిక సమతా సంకల్పం



40వ వార్డు సచివాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న వైస్ చైర్మన్ నాగవేణి



15వ వార్డు సచివాలయంలో సంతకం చేస్తున్న మాజీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విజయవాడలోని స్వరాజ్ మైదానంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19న ఆవిష్కరించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలోని వార్డు సచివాలయాలలో బుధవారం సామాజిక సమతా సంకల్పం నిర్వహించారు. సచివాలయాల్లో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి కౌన్సిలర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 40వ వార్డు సచివాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం నుంచి వారం రోజుల పాటు సచివాలయాల్లో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 15వ వార్డులో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, 24వ వార్డులో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పెదలంక లక్ష్మిలావణ్య సచివాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించి, సంతకాల సేకరణపై సంతకం చేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాలలో ఆయా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చకచకా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు పనులు



మార్కెట్ వంతెన కూడలిలో ఏర్పాటు చేసిన సిగ్నల్‌లైట్ల దిమ్మె

తెనాలిరూరల్: పట్టణంలో దీర్ఘకాలికంగా ఉన్న ప్రధాన సమస్యల్లో ఒకటైన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. సుమారు రెండు నెలల క్రితం పోలీసు అధికారులతో కలసి పట్టణంలో పర్యటించిన ఆయన ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు వివిధ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని సూచించి ఆయా కూడళ్లను స్వయంగా పరిశీలించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను గుర్తించారు. పట్టణ చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం, కొత్త వంతెన, మార్కెట్ వంతెన, బస్టాండ్ సమీపంలోని సాయిబాబా గుడి, గాంధీచౌక్ సమీపంలోని పాత అశోక్ పెన్ వర్క్స్ సెంటరు, పాత ప్రభుత్వ వైద్యశాల వద్ద, పాత వీనస్ థియేటర్ సెంటరు, కబేళా వంతెన కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఇందు కోసం సీసీఎల్ ఫ్యాక్టరీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్ రూ.30 లక్షలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ప్రస్తుతం సిగ్నల్స్ ఏర్పాటు చేసే పనులు చకచకా జరుగుతున్నాయి. మరో 20 రోజుల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతో పట్టణంలోని ట్రాఫిక్ సమస్య కొంత వరకైనా పరిష్కారమవుతుందని పట్టణ వాసులు అంటున్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ఒక గంట సమ్మె



సమ్మె సమయంలో నినాదాలు చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

తెనాలి: ఎల్ఐసీ ఉద్యోగుల జాయింట్ ఫోరం పిలుపు ప్రకారం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ బుధవారం దేశవ్యాప్తంగా చేపట్టిన ఒక గంట సమ్మెలో తెనాలి ఎల్ఐసీ ఉద్యోగులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి గంటసేపు సమ్మె చేశారు. ఎల్ఐసీ ఉద్యోగులకు వేతన సవరణ చర్చలు ప్రారంభించాలని, నూతన పింఛను విధానం రద్దుచేసి, పాత పింఛను విధానం అమలుచేయాలని, ఎల్ఐసీలో అన్ని కేడర్లలో రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్–మచిలీపట్నం డివిజన్ ఉపాధ్యక్షుడు వేదాంతం ఫణీంద్ర మాట్లాడుతూ ఎల్ఐసీ ఉద్యోగులకు 2022 ఆగస్టు ఒకటి నుంచి వేతన సవరణ జరగాలని, గడువుదాటి 17 నెలలైనా యాజమాన్యం చర్చలకు పిలవలేదన్నారు. ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్, తెనాలి శాఖ నాయకులు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పింఛను అనేది ఉద్యోగుల హక్కుగా 1982లోనే సుప్రీంకోర్టు తీర్పునిచ్చినట్టు చెప్పారు. తెనాలి శాఖ సీనియర్ మేనేజరు గౌతమ భీమారావు మాట్లాడుతూ పాలసీదారులకు మెరుగైన సేవలను అందించటానికి ఎల్ఐసీలో అన్ని కేటగిరీల్లో రిక్రూట్‌మెంట్ చేపట్టాలన్నారు.

యూనియన్, తెనాలి శాఖ కార్యదర్శి దేవరకొండ వెంకటసుబ్బారావు, అధ్యక్షుడు పిసుపాటి సుధాకర్, ఎల్ఐసీ నాయకులు కోళ్లపూడి రాజు, ఎల్ఐసీ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ రమేష్, జలవాది శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సంస్కృతి ప్రతిబింబించేవి రామరాజ్ వస్త్రాలు

- పారిశ్రామికవేత్త, కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం
- తెనాలిలో కొలువుదీరిన రామ్‌రాజ్ కాటన్ షోరూం



ప్రారంభిస్తున్న కొత్త సుబ్రహ్మణ్యం

తెనాలి: భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే వస్త్రాలకు రామ్‌రాజ్ కాటన్ ఇప్పుడొక బ్రాండ్ ఇమేజ్‌ను సంతరించుకుందనీ, ఇందుకోసం 45 ఏళ్లుగా వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ కేఆర్ నాగరాజన్ చేసిన కృషి గొప్పదని ప్రముఖ పారిశ్రామికవేత్త, కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రసిద్ధ వస్త్ర సంస్థ స్థానిక బోసురోడ్డులో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఎదుట ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ 289వ షోరూంను బుధవారం ఉదయం ఆయన ప్రారంభించారు. తెనాలి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు జ్యోతిని వెలిగించగా చాంబర్ కార్యదర్శి, చార్టర్డ్ అకౌంటెంట్ రావూరి సుబ్బారావు తొలి కొనుగోలు చేశారు. కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, రామ్‌రాజ్ వస్త్రాలకు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం ఉందన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ దేసు శ్రీనివాసరావు మాట్లాడుతూ సంప్రదాయాలను మరిచిపోతున్న నేటిరోజుల్లో తెలుగుదనాన్ని ప్రతిబింబించే వస్త్రాలతో రామ్‌రాజ్ సంస్థ ప్రజల ముందుకు రావటం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు వేణు, కొత్త కృష్ణకుమార్ పాల్గొన్నారు.

14 నుంచి 17వరకు సంక్రాంతి సాంస్కృతిక సంబరాలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న శ్రీకళా నిలయం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు

కొల్లిపర: ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు శ్రీ కళా నిలయం ఆధ్వర్యంలో స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణంలో గాదె సుబ్బారెడ్డి కళావేదికపై సంక్రాంతి సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ కళా నిలయం అధ్యక్షులు జొన్నల అమ్మిరెడ్డి తెలిపారు. బుధవారం శ్రీకళా నిలయం కార్యాలయంలో కార్యక్రమాల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ 14న సాయంత్రం 6గంటలకు విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, 9గంటలకు చైతన్య కళాభారతి కరీంనగర్ వారి స్వప్నం రాల్చిన అమృతం నాటిక, 15న ఉదయం 10గంటలకు మండల స్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలు, సాయంత్రం 7గంటలకు పాడాలని ఉంది, 10గంటలకు 2022–23 సంవత్సరం పది, ఇంటర్ విద్యార్థులకు గుదిబండి కృష్ణారెడ్డి స్మారక ప్రతిభా పురస్కారం, బహుమతులు అందజేయటం. 10.30 గంటలకు శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారిచే కౌసల్యా సుప్రజా రామా నాటిక, 16న సాయంత్రం 7గంటలకు మల్లాది క్రియేషన్స్ హైదరాబాద్ వారిచే వెన్నెలొచ్చింది హాస్య నాటిక, 8గంటలకు శ్రీ అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు వారిచే నాన్నా నేనొచ్చేస్తా నాటిక, 9గంటలకు అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి జగుతున్న కథ నాటిక, 10గంటలకు ముగ్గుల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం, 17న సాయంత్రం 6గంటలకు కుమారి తేజస్వీ ప్రఖ్య కూచిపూడి నృత్య ప్రదర్శన, విద్యార్థుల ప్రత్యేక నృత్య ప్రదర్శనలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి ముగ్గుల పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు 15వ తేదీ ఉదయం 10 గంటలలోపు వారి పేర్లు శ్రీకళా నిలయం కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఆరిమండ శివశంకరరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, ఆరిమండ వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ హఠాన్మరణం



గడవర్తి సుబ్బయ్య (ఫైల్)

తెనాలి: మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడవర్తి సుబ్బయ్య (63) హఠాన్మరణం చెందారు. స్థానిక గంగానమ్మపేటలోని స్వగృహంలో బుధవారం మధ్యాహ్నం భోజనం అనంతరం విశ్రాంతి తీసుకుంటూ ఉండగా, నాలుగు గంటల ప్రాంతంలో గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు హుటాహుటిన సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్టు ధ్రువీకరించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. గడవర్తి సుబ్బయ్య తెనాలి మున్సిపల్ కౌన్సిలర్‌గా, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన భార్య శ్రీదేవి కూడా కౌన్సిలర్‌గా చేశారు. ఆ తర్వాత తెనాలి వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్‌గానూ సుబ్బయ్య బాధ్యతలు నిర్వర్తించారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు మహమ్మద్ ఖుద్దూస్, కాకుమాను కనకరాంబాబు, పలువురు మాజీ కౌన్సిలర్లు, యాదవ సంఘీయులు సుబ్బయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు గురువారం నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలియజేశారు.

ఎమ్మెల్యే శివకుమార్ సంతాపం..

గడవర్తి సుబ్బయ్య హఠాన్మరణంపై ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. రాజకీయాల్లో సుబ్బయ్యతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం లోకకళ్యాణార్థం మహాయజ్ఞం నిర్వహిస్తున్న కారణంగా వ్యక్తిగతంగా హాజరుకాలేకపోతున్నట్టు చెప్పారు. యాగం ముగిసిన తర్వాత కుటుంబసభ్యులను పరామర్శిస్తానని చెప్పారు.

ఆరోగ్య భరోసా కల్పిస్తున్న సత్వర చికిత్సా కేంద్రం

- తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో ప్రారంభమయిన సేవలు
- లోపాలను నయం చేస్తున్న వైద్యులు



తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లా సత్వర చికిత్సా కేంద్రం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



వినికిడి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

తెనాలిఅర్బన్: పుట్టుకతో పిల్లలు వివిధ రకాల లోపాలతో జన్మిస్తుంటారు. అలాంటి వారికి జిల్లా సత్వర చికిత్సా కేంద్రం (డైక్) ఆరోగ్య భరోసాను కల్పిస్తుంది. పుట్టుకతో వచ్చే గ్రహణ మొర్రి, వినికిడి, కంటి లోపాలు, వెన్నెముక, గుండె, చర్మ, మానసిక సమస్యలకు ఇక్కడ ఆధునిక వైద్యాన్ని అందిస్తూ వారిలో ధైర్యాన్ని నింపుతున్నారు. అంతేకాకుండా శస్త్ర చికిత్సలు అవసరం అయిన చిన్నారులను సంబంధిత వైద్యశాలలకు పంపి ఉచితంగా చేయిస్తున్నారు. దీంతో చిన్నారుల పాలిట కల్పవృక్షంలా ఇది మారింది.

- పుట్టుకతోనే పలు లోపాలు ఉన్న చిన్నారులకు త్వరగా వ్యాధి నిర్ధారణ చేసి త్వరగా చికిత్స అందించాలనే ఉద్దేశంతో నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో జిల్లా సత్వర చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. దీనిలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో 2021లో కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇచ్చింది. దీని నిర్మాణం కోసం రూ.కోటి నిధులు విడుదల చేసింది. 2022 డిసెంబర్‌లో ప్రారంభించారు. రోజుకు సగటున ప్రస్తుతం 30 నుంచి 40 మంది చిన్నారులు ఇక్కడ సేవలు పొందుతున్నారు. వీరికి సేవలు అందించేందుకు పిడియాట్రీషియన్, ఎంబీబీఎస్ వైద్యులు, డెంటల్ వైద్యులు, ఫిజియోథెరపీ వైద్యులు, చైల్డ్ సైకాలజిస్ట్, స్పెషల్ ఎడ్యుకేటర్, ఆడియాలజిస్ట్, ఆప్తమాలజిస్ట్, డెంటల్ టెక్నీషియన్, సోషల్ వర్కర్, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సులు ఇద్దరిని నియమించారు. వీరు ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సేవలు అందిస్తుంటారు.

కేంద్రంలో అందించే సేవలు ఇవి..

సాధారణంగా కొందరు చిన్నారులు పుట్టుకతో అనేక లోపాలతో జన్మిస్తుంటారు. అలాగే వయస్సు పెరిగే కొద్దీ కొంత మందిలో అనేక లోపాలు బయటపడటం జరుగుతుంటుంది. అలాంటి వారందరికి(0 నుంచి18 సంవత్సరాలు) ఇక్కడ వైద్యం అందిస్తున్నారు. ఇవి కాకుండా విటమిన్ లోపం, ఐరన్ తక్కువగా ఉన్న వారికి, న్యూట్రిషియన్ లోపాల వారికి ఇక్కడ చికిత్స అందిస్తుంటారు. బేరా (వినికిడి పరీక్షలు), ఆర్‌వోబీ స్క్రీనింగ్, ఫిజియోథెరపీ, డెంటల్‌కు సంబంధించిన మైనర్ సర్జరీలు చేస్తుంటారు. అందుకు అవసరమైన మిషనరీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అంతేకాకుండా పిల్లలకు అవసరమైన ఆడుకునే వస్తువులను ఏర్పాటు చేసింది. ఇవి కాకుండా చిన్నారులకు అవసరమైన కళ్లజోళ్లు, వినికిడి మిషన్‌లు దాతల సహకారంతో పంపిణీ చేస్తుంటారు.

శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయిస్తున్న ప్రభుత్వం..

కొంత మంది చిన్నారులకు కంటి, పంటి, వెన్నెముక, కాళ్లు వంకర్లు పోవటం వంటి సమస్యలు ఏర్పడతాయి. వారిలో కొందరికి శస్త్ర చికిత్సలు అవసరం అవుతుంటాయి. వారిని గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు, ప్రైవేట్ వైద్యశాలలకు పంపి ప్రభుత్వం ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు. దీంతో అనేక మంది చిన్నారులు తమకు వచ్చిన లోపాలను నయం చేయించుకుని నేడు సాధారణ పిల్లల వలే జీవిస్తున్నారని వైద్యులు తెలిపారు.

సత్వర చికిత్సా కేంద్రం సేవలను ఉపయోగించుకోండి..



తెనాలి జిల్లా వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా సత్వర చికిత్సా కేంద్రంలో అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాల వయస్సున్న వారికి చికిత్స అందించటం జరుగుతుంది. చిన్నారులలో వచ్చే అనేక లోపాలకు ఇక్కడ వైద్యం అందిస్తున్నాం. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా వాటిని చేయిస్తుంది. అవసరమైన వారు దీని సేవలు ఉపయోగించుకోవాలి.

–డాక్టర్ మధుబాబు, కేంద్రం ఇన్‌చార్జి, పిడియాట్రీషియన్

మాల దాసుల గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ చేస్తున్న మాలదాసులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రం నుం– విజయవాడ ఇంద్రకీలాద్రి వరకు మాలదాసుల గిరిప్రదక్షిణ కార్యక్రమం కృష్ణ ధర్మరక్షణ సంస్థ ఆధ్వర్యంలోబుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్నజీయర్ స్వామి మంగళశాసనాలతో అహోబిల రామానుజ జీయర్‌స్వామి అమృత హస్తాలతో మాలదాసుల ఆత్మ గౌరవార్థం మాలదాసుల గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 3,500 మంది పాలుపంచుకున్నారని తెలిపారు. హరిదాసుల వేషధారణలో కోలాటాల బృందాల మధ్య ఈ గిరి ప్రదక్షిణ విజయకీలాద్రి నుంచి ప్రారంభమై ప్రకాశం బ్యారేజ్ మీదుగా ఇంద్రకీలాద్రి అమ్మవారి గిరి ప్రదక్షిణతో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కెల్లా దుర్గారావు, తాళ్లూరి పవన్, శ్రీకాంత్ శర్మ పాల్గొన్నారు.